15,200 దరఖాస్తులు 41 బృందాలు



జీఓ-58 దరఖాస్తుల పరిశీలన వేగవంతం

- 15 మండలాల్లో 41 బృందాలతో క్షేత్రస్థాయి విచారణ
- పూర్తయిన జీఓ-59 దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం
- కలెక్టర్ అమయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ముందడుగు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ-58 దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా కొనసాగుతోంది. జీఓ-59 కింద రెండో విడతలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తవడంతో.. జీఓ-58 దరఖాస్తులపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ-58 కింద 26,092 దరఖాస్తులు రాగా, 15 మండలాల పరిధిలోని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో 41 బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 40 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తవడంతో మిగతా దరఖాస్తుల పరిశీలన కూడా ఈ నెలాఖరు వరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో మిగిలిన దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా సాగుతోంది. జిల్లాలో జీఓ-59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో 41 బృందాలు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాయి.

అత్యధిక దరఖాస్తులు ఇక్కడే..

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోనే జీఓ-58, 59 కింద దరఖాస్తులు 41,292 వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దరఖాస్తుల సంఖ్య అత్యధికమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిశీలన బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి క్షేత్రస్థాయి బృందం ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయడంతో పాటు జీవో నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదా అని చెక్ చేసుకోవడం, సేకరించిన ఆధారాలను ప్రత్యేకంగా రూపొందించిన 'మొబైల్ యాప్'లో నమోదు చేసి, వాటిని కలెక్టర్ లాగిన్ సిఫార్సు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దరఖాస్తులను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మరోమారు పరిశీలించిన తర్వాత ఆమోదం లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.

గతంలో వచ్చిన జీఓ 59 దరఖాస్తులపై..

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడతలో జీఓ-59 కింద 33,258 దరఖాస్తులు రాగా, విలువ కలిగిన భూములకు సంబంధించిన 5 వేల దరఖాస్తుల వివరాలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. సర్కారు ఆదేశాల మేరకు 5 వేల దరఖాస్తులను పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారించి, అర్హులైన లబ్ధిదారుల నుంచి జీఓ-59లో పేర్కొన్న విధంగా సొమ్ము వసూలు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికార యంత్రాంగం పెండింగ్‌లో ఉన్న 5 వేల దరఖాస్తులను ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం ఈ నెలాఖరు వరకు పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

బదిలీలు.. పదోన్నతులపై కసరత్తు

- తుది జాబితాపై జిల్లా విద్యాశాఖ చర్యలు
- ఐదు, ఎనిమిది ఏళ్ల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులకు బదిలీలు తప్పని సరి
- బదిలీల కోసం 1601 మంది ఉపాధ్యాయుల దరఖాస్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైంది. షెడ్యూల్ ప్రకారం అభ్యంతరాల స్వీకరణ ముగియడంతో తుది జాబితా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2015లో జరిగిన బదిలీల్లో వివిధ పాఠశాలల్లో చేరి, ఒకే పాఠశాలల్లో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఐదేళ్ల పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు కూడా తప్పనిసరిగా బదిలీ కావాల్సిరావడంతో వారు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయులు మూడు వేల మంది ఉండగా, బదిలీల కోసం వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 1601 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఐదు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు 400 మంది వరకు ఉంటారని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వీరంతా తప్పని సరిగా బదిలీ కానున్నారు. అలాగే, జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు 150 వరకు ఉన్నాయి.

కేటగిరీల వారిగా..

సీనియారిటీ ప్రాతిపదికగా నిర్వహించనున్న నేపథ్యంలో కేటగిరీల వారిగా తాత్కాలిక జాబితాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఇప్పటికే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీనియారిటీ జాబితాను ఆర్జేడీకి నివేదించారు. దీని ఆధారంగా బదిలీలు జరుగుతాయి ఎస్జీటీలు, భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల జాబితాలు సిద్ధం చేశారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత తుది జాబితాలు ప్రకటిస్తారు. తదుపరి విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు.

ఓటును వినియోగించుకోవాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డ్వాక్రా భవన్‌లో గురువారం దివ్యాంగులకు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన దివ్యాంగులు ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు పొందిన వారు ఓటును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి యాదయ్య, మున్సిపల్ డీఈ మాధవచారి, తెలంగాణ వికలాంగుల రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ, మేడ శ్రీను, ప్రియాంక, శోభ, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డి

క్లుప్తంగా...

మేడ్చల్ మున్సిపాలిటీలో నిరాశ్రయుల సర్వే

శామీర్‌పేట్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం నిరాశ్రయుల సర్వేను అధికారులు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో మేడ్చల్ రైల్వే స్టేషన్‌తో పాటు 23 వార్డుల్లో సర్వే నిర్వహించగా 20 మందిని గుర్తించామని, మేడ్చల్‌లో నిర్మించిన షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్‌లెస్ కేంద్రానికి తరలించనున్నట్లు కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వర్ తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

శామీర్‌పేట్: మేడ్చల్‌లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని బీజేపీ మేడ్చల్ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్ మాట్లాడుతూ.. మేడ్చల్ పారిశ్రామికవాడలో రైతుల నుంచి సేకరించిన భూములను కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, ప్లాట్లుగా మార్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు చెక్కు అందజేత

మేడ్చల్: రాష్ట్రంలోని అన్ని కులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి 2వ వార్డుకు చెందిన గోగికర్ చందుకు రూ.లక్ష చెక్కును మంత్రి మల్లారెడ్డి అందజేశారు.

ఆర్టీసీ కాలనీలో ప్రత్యేక పూజలు

మేడ్చల్: ఆర్టీసీ కాలనీలో కట్టమైసమ్మ ఆలయంలో గురువారం పూల అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. 1వ వార్డు కౌన్సిలర్ మానస, బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు దీప్తి, మహిళలు పాల్గొన్నారు.

8 సెల్‌ఫోన్లు చోరీ

ఘట్‌కేసర్: ఓ విల్లాలో పనిచేస్తున్న వలస కార్మికుల 8 సెల్‌ఫోన్లు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. అడిషనల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ విల్లాలో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన 8 మంది భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి భోజనం తర్వాత నిద్రించి ఉదయం లేచి చూసే సరికి 8 మంది సెల్‌ఫోన్లు గుర్తుతెలియని దుండగులు ఎత్తెకెళ్లారు. వలస కార్మికులు ఫోన్ల చోరీ విషయం సూపర్‌వైజర్ నరేశ్ రెడ్డికి తెలపగా ఆయన పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

శామీర్‌పేట్: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన గురువారం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా బోయిన్‌పల్లి తండాకు చెందిన కేతావత్ రాముునాయక్(36) ఉదయం కొల్తూర్ వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. సికింద్రాబాద్ నుంచి నారాయణపూర్ వెళ్తున్న హకీంపేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కొల్తూర్ గ్రామ పరిధిలోని టవర్ వద్ద ఢీ కొంది. దీంతో రాముునాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు వారిని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థులకు మిల్లెట్స్‌పై అవగాహన

ఉప్పల్: పోషణలో భాగంగా గురువారం చిలుకానగర్‌లోని ఎంపీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల కిషోర బాలికలకు మిల్లెట్స్‌పై అవగాహన కల్పించారు. అల్వాల్ ప్రాజెక్ట్ అధికారిణి డి.స్వాతి హాజరై విద్యార్థులకు మిల్లెట్స్ ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పార్కింగ్ చేస్తే చర్యలు

బోడుప్పల్: ఎక్కడ పడితే అక్కడ లారీలు అక్రమంగా పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. చెంగిచర్ల చింతల చెరువు పక్కన చెరువు స్థలంలో లారీలను అక్రమంగా పార్కింగ్ చేయడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ వెంటనే అక్కడ నుంచి లారీలను ఖాళీ చేయించి కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా రోడ్డు పక్కన అక్రమంగా పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ ఆఫీస్‌తో పాటు రాంపల్లి అంబేడ్కర్ చౌరస్తాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై(ఈవీఎం) చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసే నాయకులను ఎన్నుకోవాలి

శామీర్‌పేట్: యువత ఓటును అమ్ముకోవద్దని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ టీఎస్‌వీఎన్ త్రిల్లేశ్వర్ అన్నారు. గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గీతా జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిజమైన ప్రజాసేవ చేసే నాయకులను ఎన్నుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. మెప్మా ఆర్పీలు, బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన మెప్మా ఆర్పీలు

మేడ్చల్: తక్కువ వేతనాలు ఉన్న తమకు కనీసం వేతనం రూ.18 వేలు చేయాలని మంత్రి మల్లారెడ్డికి మెప్మా ఆర్పీలు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం మంత్రి నివాసంలో మెప్మా ఆర్పీలు కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా పేద మహిళలకు వివిధ రకాల సేవలు అందిస్తున్నామని, రూ.4 వేల జీతం చాలక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రికి వివరించామన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని, తమ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చినట్లు మెప్మా ఆర్పీలు తెలిపారు.

నగల వ్యాపారిని బెదిరించిన నిందితుల అరెస్టు

కీసర: నకిలీ పోలీసు ఐడీ కార్డులతో నగల వ్యాపారిని బెదిరించిన ఐదుగురు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. కీసరలోని ఓంప్రకాష్ నగల దుకాణంలోని దినేష్ దేవాసి అనే వ్యక్తి వెళ్లి ఓపియమ్ నల్లమందును కౌంటర్‌పై ఉంచి, ఓంప్రకాష్‌కి ఇవ్వమని దుకాణంలో పనిచేస్తున్న ముఖేష్‌కు ఇచ్చి వెళ్లిపోయాడు. వెంటనే సాగర్ దేవాసి, శ్రావణ్ కుమార్ గౌడ్, హనుమాన్‌లు హుందాయ్ కారులో వచ్చి పథకం ప్రకారం దుకాణంలో ప్రవేశించి నకిలీ పోలీస్ ఐడీ కార్డులు చూపించి ఎస్‌ఓటీ పోలీసులమని చెప్పారు. దుకాణంలో నల్లమందు సరఫరా చేస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీ కోసం వచ్చినట్లు చెప్పారు. కౌంటర్‌పై ఉన్న బాక్స్ ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించి, పోలీసు కేసు పెట్టి షాపును మూసివేస్తామని బెదిరించారు. ఈ విషయం మీడియాతో పాటు ఇతరులకు తెలియకముందే రూ.10 లక్షలు ఇస్తే వదిలేస్తామనడంతో ఓంప్రకాష్‌కు అనుమానం వచ్చి కీసర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి నిందితులు గుజ్జర్ కిషోర్, దివాస్ సాగర్, హనుమాన్ జాట్, మల్లారపు శ్రావణ్ కుమార్ గౌడ్, దినేష్ దేవాసిలను అదుపులోకి తీసుకున్నారు. కారు, ఏడు ఫోన్లు, 1.05 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మొక్కలు నాటుడెందుకు.. చెట్లు నరుకుడెందుకు..?



అవుషాపూర్‌లో దళితవాడలో నరికిన హరితహారం చెట్లు

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవుషాపూర్ దళితవాడలో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆ చెట్లను తాజాగా నరకడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటడం ఎందుకు.. పెరిగిన చెట్లను నరకడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల సంరక్షణంపై దృష్టి సారించాలని, నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, శ్రీవాసవి సేవా సంఘం సభ్యులు

జవహర్‌నగర్: శ్రీవాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకొని గురువారం జవహర్‌నగర్ మార్కెట్ లైన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జమాల్‌పూర్ నవీన్‌కుమార్, గొడుగు వేణు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బల్లి శ్రీనివాస్, అశోక్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రవీందర్, వాసవి పరపతి సంఘం అధ్యక్షుడు సంతోష్‌గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట 11 మంది బైండోవర్

ఘట్‌కేసర్: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, రానున్న సాధారణ ఎన్నికల దష్ట్యా 11 మందిని తహసీల్దార్ కృష్ణ ఎదుట గురువారం సీఐ మహేందర్‌రెడ్డి బైండోవర్ చేశారు. ఘనాపూర్‌కు చెందిన వేముల హేమంత్‌గౌడ్, వేముల వెంకటేశ్‌గౌడ్, చిలుగూరి మహేశ్, చిలుగూరి లింగం, ఎదులాబాద్‌కు చెందిన బేలా సురేశ్, కొమిరిశెట్టి రంగయ్య, అవుషాపూర్‌కు చెందిన బానోతు రమేశ్, కంచెర్ల తిరుమల్‌రెడ్డి, ఘట్‌కేసర్‌కు చెందిన ఎస్‌కే మున్వీర్, ఎండీ ఇమామ్, కంది సతీశ్ నడవడికపై ఏడాది పాటు ఆంక్షలు విధించారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి



చైర్ పర్సన్ పావనీజంగయ్యకు వినతి అందజేస్తున్న ఎలక్ట్రిషియన్లు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో ఎలక్ట్రిషియన్ల సంక్షేమ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని నూతనంగా ఎన్నికై న ఎలక్ట్రిషియన్ల నూతన కమిటీ సభ్యులు, ఎలక్ట్రిషియన్లు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యకు గురువారం ఆమె కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పట్టణంలో ఎలక్ట్రిషియన్ల సంఘం భవనం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు ఫాతిమాను విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులు హిందీలో నిర్వహించిన నాటికలు, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రంగాచారి, ఉపాధ్యాయులు గోపీనాథ్, ప్రేమ్‌కుమార్, రవికుమార్, అనిల్‌కుమార్, మోహన్, రాజారావు, ప్రభాకర్, మదురమ్మ, వేదనాయకి, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మునీరాబాద్‌కు రాష్ట్ర స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గ్రామ సర్పంచ్ గణేశ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామానికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 గాను ఉత్తమ గ్రామ పంచాయతీగా మునీరాబాద్ గ్రామం ఎంపిక కావడంతో ఈ మేరకు గురువారం రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐఆర్‌డీ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియాలు గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను సత్కరించి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డును ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గణేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో మండల, జిల్లాస్థాయి అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో అవార్డు సాధ్యమైందని తెలిపారు. పంచాయతీ రాజ్ డైరెక్టర్ హన్మంత్‌రావు, జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం, డీఆర్‌డీఓ పీడీ పద్మాజారాణి, డీపీఓ రమణమూర్తి, ఎంపీడీఓ పద్మావతి, ఎంపీఓ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దొరల పాలన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్ష భగ్నం చేసినందుకు నిరసన
- పలు ప్రాంతాల్లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



గుండ్లపోచంపల్లిలో..



ఘట్‌కేసర్‌లో సుదర్శన్‌రెడ్డి, శోభారాణి తదితరులు

మేడ్చల్: రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందని బీజేపీ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేసినందుకు గురువారం మేడ్చల్ మున్సిపాలిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శులు శ్రీశైలంయాదవ్, ప్రేమ్‌దాస్, ఉపాధ్యక్షులు రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు సరస్వతి, హంసరాణి, నాయకులు కృష్ణాగౌడ్, రవీందర్‌గౌడ్, మహేశ్, అశోక్, సురేందర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ పట్టణంలో..

ఘట్‌కేసర్: కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం నిరసన చేపట్టారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు విక్రాంత్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ నరేశ్, సురేశ్, రామోజీ, మశ్చేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బస్వరాజ్, రఘు, సురేంద్ర, అనిల్, మహేశ్, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కీసర మండల కేంద్రంలో..

కీసర: కీసర మండల కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం బీజేపీ నాయకులు దహనం చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాగుల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మెట్టు కృష్ణ, జిల్లా యువమోర్చా నాయకుడు నల్ల వెంకట్‌రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నాగరాజు, మండల సెక్రెటరీ మెట్టు మహేందర్, నాయకులు పాండు, మల్లేష్, గణేష్, ఆంజనేయులు, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నోజిగూడలో..

పోచారం: అన్నోజిగూడలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి, జాతీయ రహదారిపై బైఠాయించారు. నిరసనలో బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాథ్ నాయక్, పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అచ్చిని నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మెట్టు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులు



అన్నోజిగూడలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు